క్లుప్తంగా

చంద్రంపాలెంలో దేవులపల్లి జయంతి



చంద్రంపాలెంలో దేవులపల్లి విగ్రహానికి నివాళులు

సామర్లకోట: ప్రముఖ పాటల రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతిని రావువారి చంద్రంపాలెంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి స్వగ్రామంలో పాఠశాల లేకపోవడంతో తన ఇంటిని పాఠశాలకు విరాళంగా ఇవ్వడంతో పాఠశాల ఆవరణలో ఆయన అభిమానులు దేవులపల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన జయంతిని పురస్కరించు కొని దేవులపల్లి కృష్ణశాస్త్రి చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి శ్రీలామంతుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దేవులపల్లి తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీమల భవానీ, ట్రస్టు సలహాదారుడు దేగల బూరిబాబు, గ్రామ పెద్దలు తలటం బాబులు, దమ్మల బాబ్జి, తలారి సూరిబాబు, గొర్లెర అచ్చారావు పంచాయతీ కార్యదర్శి పేరాబత్తుల నాగేశ్వరరావు, ట్రస్టు సభ్యులు శివరాజు, యస్ వీరబాబు, ఆర్ సూరిబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కొత్తపల్లి: సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలిని స్థానిక ఎస్సై వెంకటేష్ కోరారు. మండలంలోని కొండెవరం శివారులో సారా స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లను ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న కొండెవరానికి చెందిన వాసంశెట్టి వీరబాబును అరెస్ట్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దీపం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: ప్రజలు దీపం(ఉచిత గ్యాస్) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మండలంలోని దీపం-2 పథకం కింద మంజూరైన ఉచిత గ్యాస్ సిబ్సిడీ పథకాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన పంపిణీ సభలో ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడారు.

ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

కొత్తపల్లి: మత రాజకీయాలు చేస్తున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలనే ప్రధాన డిమాండ్‌తో డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన 'ప్రజా హక్కుల ర్యాలీ'ని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారావు పిలుపునిచ్చారు. స్థానిక సతీష్ చంద్ర భవనంలో గురువారం పిఠాపురం నియోజకవర్గ లిబరేషన్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శీలం అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి మతతత్వ రాజకీయాలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో నిత్యావసర సరకులు ధరలు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతరం ప్రజాహక్కుల ర్యాలీ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గొడుగు సత్యనారాయణ, జిల్లా నాయకులు ఏసురత్నం, లోవకుమారి, సోనీ, రాంబాబు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కార్తికం.. కమనీయం

- పాదగయ క్షేత్రంలో నేటి నుంచి కార్తిక మాసోత్సవాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- పాదగయ పుష్కరిణిలోకి కొత్త నీరు
- దర్శన వేళలు పెంపు



పిఠాపురంలో కార్తికమాస పూజలకు సిద్ధమైన పాదగయక్షేత్రం

పిఠాపురం: పవిత్ర కార్తిక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఉదయం పాడ్యమి దీపాలు వెలిగించి కార్తిక మాస పూజలను ప్రారంభించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ఆకాశ దీపాలతో కార్తిక మాస పూజలకు శ్రీకారం చుట్టనున్నారు. కార్తికమాసం శివునికి ప్రీతికరమైన మాసం కావడంతో శైవక్షేత్రాలను ఉత్సవాలకు ముస్తాబు చేశారు. స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లతో పాటు ప్రత్యేక అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుష్కరిణికి కొత్త శోభ

వేలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం పాదగయకు తరలి వచ్చే అవకాశం ఉండడంతో ఇప్పటికే పాదగయ పుష్కరిణిలో పాత నీరు తొలగించిన అధికారులు కొత్త నీటిని నింపారు. ఎక్కువగా పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలకే భక్తులు ప్రాధాన్యతను ఇస్తుంటారు. మహిళలు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి పుష్కరిణిలో కార్తిక దీపాలను వదులుతుంటారు. దీని కోసం ఆలయ అధికారులు పుష్కరిణిలో కొత్త నీటిని నింపడంతో పాటు కార్తిక దీపారాధనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కార్తికమాసం సందర్భంగా తొలి రోజు నుంచి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిరోజూ విశేష పూజలు

కార్తిక మాసం సందర్భంగా ప్రతిరోజూ స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరిస్తున్నారు. కార్తికమాస పుణ్య స్నానాలకు పవిత్ర పాదగయ పుష్కరిణికి మరమ్మతులు పూర్తి చేశారు.

తెల్లవారుజామున 4 గంటల నుంచే..

కార్తికమాసంలో భక్తుల సౌకర్యార్థం కుక్కుటేశ్వర స్వామి దర్శన వేళలను పెంచినట్లు అధికారులు తెలిపారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారి ఆలయం తెచి ఉంచనున్నారు. భక్తుల రద్దీని బట్టి ఆలయం మరింత సేపు తెరచి ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

దూర ప్రాంత భక్తులకు ఆన్‌లైన్‌లో పూజలు

పవిత్ర కార్తిక మాసంలో పాదగయ క్షేత్రంలో పూజలు చేయించుకోవాలనుకునే దూర ప్రాంతం భక్తులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ పూజలకు టిక్కెట్టు తీసుకున్న వారి పేరున వారు కోరుకున్న రోజున పూజలు నిర్వహించి ప్రసాదాలు పోస్టు ద్వారా పంపిస్తాం. భక్తుల సౌకర్యార్థం పుణ్యస్నానాలకు ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా సోమవారాలు, ఇతర పర్వదినాల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందరికీ స్వామి వారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది కార్తికమాసంలో సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దానికి రెట్టింపు సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నాం. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– భద్రరావు, సూపరింటెండెంట్, పాదగయ క్షేత్రం, పిఠాపురం

ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గడిగట్ల సత్తిబాబు

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీ ప్రకటనలకే పరిమితమైందని, ప్రభుత్వం తక్షణమే హామీని నెరవేర్చాలంటూ భవప నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు గడిగట్ల సత్తివాబు, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు నీలపాల సూరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తి అయ్యిందని సంబరాలు చేసుకోవడం కాదని, ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఇసుక లభించకపోవడం, ధరల పెరుగుదల, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి రవాణా చార్జీల పేరుతో ఇసుక వ్యాపారంతో కూటమి నేతలు కోట్ల రూపాయలు సంపాదించారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని సత్వరమే అమలు చేసి అందరికి ఉచిత ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవిందలపూడి నాగ పద్మనాభం, నీలపాల కృష్ణ, బొమ్మిశెట్టి శ్రీనివాస్, ముమ్మన శ్రీను, పత్తి నాగు పాల్గొన్నారు.

కొండెవరంలో రీ సర్వే గ్రామ సభ

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయం-1 వద్ద శుక్రవారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. శనివారం కొండెవరం గ్రామ సచివాలయం -2 వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తిక మాస ఉత్సవాలు



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం



రూ.100 ప్రత్యేక దర్శనానికి క్యూలైను

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి డిసెంబరు 2 వరకు కార్తిక మాస ఉత్సవాలు జరుగుతాయి. ఆలయంలో స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకోవడానికి ఉచిత దర్శనంతో పాటు రూ.20 శ్రీఘ్రదర్శనం రూ.50, ప్రత్యేక దర్శనం రూ.100 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అభిషేకాలకు రూ.200, లక్షపత్రి పూజలకు రూ.2,500గా నిర్ణయించారు. ఈ మేరకు ప్రతి రోజు లక్షపత్రి పూజలకు ఉండేలా భక్తులను ఎంపిక చేశారు. పంచారామాలు దర్శించుకునే భక్తుల దర్శనం అయ్యే వరకు ఆలయం తెరచి ఉంచుతారు. కార్తిక మాసంలో ప్రతిరోజు ఉదయం గోపూజ, లక్షపత్రి పూజలు, సాయంత్రం విఘ్నేశ్వరుని పూజలు చేస్తారు. లక్ష పత్రి పూజలు చేసుకునే వారి కోసం ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేస్తారు. కార్తిక మాసంలో ఐదు ఆదివారాలు, నాలుగు సోమవారాలు, కార్తిక పౌర్ణమి, స్వామి వారి ఆరుద్ర నక్షత్రం, మాసశివరాత్రి రోజున అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఆయా రోజులల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పుష్కరణిలో నీటిని పూర్తిగా తీసి వేసి కొత్త నీటితో నింపారు. డిసెంబరు ఒకటిన అమావాస్యను పురస్కరించుకొని కోటి దీపాలంకరణ, డిసెంబరు 2న పోలి పాడ్యమి సందర్భంగా స్వామి వారి జటాజుటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజు తెల్లవారు జామున, సాయంత్రం భక్తులు కార్తిక దీపాలను వెలిగించుకొవడం జరుగుతుంది. ప్రతి రోజు సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో ధ్వజ స్తంభం వద్ద ఆకాశదీపం వెలిగిస్తారు. స్వామి వారి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకొని ఈనెల 19న తెప్పోత్సవం ఉంటుంది. అదే విధంగా పాత సామర్లకోటలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలోను, మఠంసెంటర్‌లన్నున్న చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, ఐదు తూముల వద్ద వేంచేసియున్న అన్నపూర్ణ సమతే రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, మున్సిపల్ కార్యాలయం వద్ద వేంచేసి యున్న జగదీశ్వరస్వామి ఆలయంలోను కార్తిక పూజలు జరుగుతాయి.

పింఛన్ల కోసం పడిగాపులు



సామర్లకోట ఏడవ సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



వాకతిప్ప గ్రామ సచివాలయంలో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

సామర్లకోట: సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులు శుక్రవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు వేకువ జామునే ఇళ్లకు వచ్చి పింఛన్లు అందజేసేవారు. అయితే ప్రస్తుతం పింఛన్లను సచివాలయాల వద్ద పంపిణీ చేయడంతో లబ్దిదారుల ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సర్వర్లు పని చేయక పోవడంతో సచివాలయంకు వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం సచివాలయాలకు తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు తరువాత సర్వర్లు పని చేయడంతో సాయంత్రం వరకూ పట్టణ పరిధిలో 60 శాతం మాత్రమే పంపిణీ అయినట్టు అధికారులు తెలిపారు. కాగ మండల పరిధిలోని 18 గ్రామాలలోను 35 శాతంకు మించి ఫించన్ల పంపిణీ జరుగ లేదని అధికారులు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సర్వర్లు పని చేయలేదని, దాంతో పింఛనుదారులు ఇబ్బంది పడిన మాట వాస్తవమేనని చెప్పారు.

కొత్తపల్లి మండలంలో...

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో సర్వర్ పని చేయకపోవడంతో పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల కోసం శుక్రవారం పడిగాపులు కాశారు. పింఛన్ పంపిణీ చేసే సర్వర్ పనిచేయకపోవడంతో ఉదయం నుంచి లబ్ధిదారులు పింఛన్ కోసం నిరీక్షించారు.

వలంటీర్ల నిరసన



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

పెద్దాపురం: ఎన్నికల సమయంలో వార్డు, గ్రామ వలంటీర్లకు ఎటువంటి అన్యాయం జరుగకుండా, వలంటీర్ల జీతాలు పది వేల రూపాయలిస్తామని ఇప్పుడు ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై పెద్దాపురం పట్టణంలో శుక్రవారం వార్డు, గ్రామ సచివాలయ వలంటీర్లు రోడ్డెక్కారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భగా సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి రవి మాట్లాడుతూ ఎన్నికల ముందు రాజీనామ చేయని వలంటీర్లకు న్యాయం చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారన్నారు. వారికి ఐదు వేలకు బదులు పది వేల రూపాయల వేతనం ఇస్తామని, ఇప్పుడు కన్నెత్తిచూడడం లేదన్నారు. వలంటీర్లను తొలగించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడితే ఆందోళనకు సిద్ధమతామన్నారు. సత్వరమే వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.విజయ, టి.శ్రీజ, టి.కిరణ్మయి, సుబ్బలక్ష్మి, శ్రీకాంత్, ఉల్లి బంగారయ్య, భాను పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

- 11న కలెక్టరేట్ వద్ద ధర్నా
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న తోకల ప్రసాద్

పెద్దాపురం: కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చెయ్యాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణ తాపీ వర్కర్ల సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను తక్షణమే పరిష్కరించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులు దృష్ట్యా ఉచిత ఇసుకపై ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ హాజరుకావాలని ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తుల మురళి, కోన శ్రీను, శేషు, కాశి, సిరికి రాంబాబు, రామకృష్ణ, కృష్ణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- వివిధ శాఖల సమన్వయంతో ఘనంగా కార్తిక మాసోత్సవాలు
- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సామర్లకోట: వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కార్తిక మాస ఉత్సవాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. కార్తిక మాస ఏర్పాట్లపై శుక్రవారం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్తిక మాసంలో వేలాది మంది భక్తులు ప్రతిరోజు ఆలయ కోనేరులోను, గోదావరి కాలువలోను స్నానాలు చేస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకొని గోదావరి కాలువలో కాలుష్య జలాలు కలువకుండా చర్యలు తీసుకొవాలని ఎమ్మెల్యే కాలుష్య నియంత్రణ మండలి అధికారిని ఆదేశించారు. గోదావరి కాలువ నీటినే రెండు మున్సిపాలిటీలు, కాకినాడ కార్పొరేషన్ తాగునీరుగా ఉపయోగిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని వ్యర్థ జలాలు గోదావరి కాలువలో కలువకుండా రెవెన్యూ, పొల్యూషన్, ఇరిగేషన్ అధికారులు ఆయా పరిశ్రమలను సందర్శించాలని సూచించారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తునకు రాత్రి వరకు ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు సిఫ్టుల ద్వారా పోలీసు సిబ్బందిని ఆలయం వద్ద నియమిస్తామని సీఐ ఎ.కృష్ణమోహన్ తెలిపారు. పారిశుధ్యం స్ట్రీట్ లైటింగ్ సమస్య లేకుండా చేస్తామని మున్సిపల్ కమిషన్ ఎ.శ్రీవిద్య హామీ ఇచ్చారు. ఆలయం వద్ద 24 గంటలు కరెంటు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని ట్రాన్సుకో ఏఈ రమేష్ కుమార్ అన్నారు. ఆలయం వద్ద ఫైర్ ఇంజన్‌తో పాటు అత్యవసర పరిస్థితిలో క్యూలో ఉన్న వారు కిందికి దిగేలా నిచ్చెన ఏర్పాటు చేస్తామని అగ్నిమాపక అధికారి ప్రసాద్ తెలిపారు. పంచారామ క్షేత్రల్లో భక్తుల దర్శనంలో భాగంగా ప్రతి సోమవారం చివరిలో రాత్రి సమయంలో బస్సులు వస్తాయని స్టేషన్ మేనేజరు వజ్రం చెప్పారు. వాహనాలకు పార్కింగ్ సమస్య లేకుండా రైతు సంఘం స్థలంలోను పార్కింగ్ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు తెలిపారు. హెల్త్ సిబ్బంది ఆలయం మూసే వరకు అందుబాటులో ఉండే విధంగా జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకు వెళతామని తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి చెప్పారు. కార్తిక సోమవారాలల్లో తెల్లవారు జామున 4 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ ఆలయం తెరచి ఉంటుందని ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. అదే విధంగా సాధారణ రోజుల్లో ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 2, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటలకు ఆలయం తెరచి ఉంటుందని వివరించారు. గతంలో హారతి కార్యక్రమం ఏవిధంగా ఉండేదో ప్రస్తుతం అదేవిధంగా ఉండాలని భక్త సంఘ నాయకులు బిక్కిన సాయి, గంజి బూరయ్య, వల్లూరి దొరబాబులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సేపెని సురేష్, బలుసు వాసు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ విత్తనాల వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమార స్వామి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ఏర్పాట్లను రాజప్ప పరిశీలించారు.

స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

సామర్లకోట: జాతీయ సమైక్యతకు సూర్తి సర్దార్ వల్లబాయ్ పటేల్ అన్ని తససీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా బుధవారం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి తహసీల్దార్ నివాళ్లు అర్పించారు. ధైర్యంగా ఆయన చేసిన పనులను గుర్తించి ఉక్కు మనిషి అనే బిరుదు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల ప్రత్యేకాధికారి వరప్రసాద్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురష్కరించుకుని గురువారం పెద్దాపురం నవోదయలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జవహార్ నవోదయ విద్యార్థులచే పట్టణంలో ఐక్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక నవోదయ విద్యాలయలో ప్రారంభమై కొత్తపేట పెట్రోల్ బంక్ సెంటర్, దర్గా సెంటర్, మున్సిపల్ సెంటర్ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేదీప్యమానం

- కన్నులపండువగా దీపావళి
- ఆలయాల్లో ఆకట్టుకున్న దీపాలంకరణలు



గొల్లప్రోలు పాదాంబిక అమ్మవారి ఆలయంలో ఆకట్టుకున్న దీపాలంకరణ



సామర్లకోటలో దివిటీలు కొడుతున్న ఒక కుటుంబం



కొత్తపల్లిలో దివిటీలు కొట్టి దీపావళి జరుపుకొంటున్న ప్రజలు

పిఠాపురం: దివ్వెల పండుగ దీపావళి పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో గురువారం రాత్రి కన్నులపండువగా జరిగింది. ప్రతి ఇంటా వెలుగులు నిండాయి. ప్రజలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ బాణసంచా కాల్చి సందడి చేశారు. గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు సంప్రదాయ దుస్తులు ధరించి దివిటీలు కొట్టారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలు, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని ఆలయాలు విశేష శోభను సంతరించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక దీపాలంకరణలు చేశారు. పలువురు భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దీపావళి అత్యంత వైభవంగా జరగడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా గురువారం దీపావళి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రజలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ బాణసంచా కాల్చి సందడి చేశారు. ఇళ్ల లోగిళ్లను దీపాలతో అలంకరించారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, బాలాత్రిపురా సుందరి సమేత రాజశేఖర స్వామి, శ్రీధర్మశాస్తా, ఉప్పాడలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలను దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలను చేశారు.

ఉత్సాహంగా దీపావళి వేడుకలు

సామర్లకోట: దీపావళి వేడుకలు గురువారం రాత్రి ఉత్సాహంగా జరుపుకొన్నారు. దీపావళి రోజున సాయంత్రం మహిళలు లక్ష్మీదేవికి పూజలు చేసి, దీపాలను వెలిగించారు. ఆర్థిక పరిస్థితి మేరకు పిండి వంటలను తయారు చేసి లక్ష్మీదేవికి నైవేద్యం పెట్టి ప్రసాదంగా స్వీకరించారు. అనంతరం చిన్నా పెద్దా అంతా బాణసంచా కాల్చారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరం

పెద్దాపురం: స్థానిక అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని ప్రజలు గురువారం రాత్రి దీపావళి పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి బాణసంచా తయారీలో నిమగ్నమై సాయంత్రం తమ పాడిపంటలు వృద్ధి చెందాలని లక్ష్మీదేవి వేడుకుంటూ దీపావళి సందడి చేశారు. ప్రతి ఇంటిని దీపాలతో అలంకరించి మహిళలు పూజలు నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం ప్రతీ ఇంటా దివిటిలను కొట్టి దీపాల వద్ద చిన్ని చిన్ని టపాసులు, చిచ్చు బుడ్డులు, మతాబులను కాల్చి వేడుకను వైభవంగా నిర్వహించుకున్నారు. పిన్న పెద్ద తారతమ్య లేకుండా కటుంబ సమేతంగా బంధుమిత్రులతో టపాసులు కాల్చుతూ అత్యంత ఘనంగా దీపావళి పర్వదినాన్ని నిర్వహించారు.

చదలాడ-తిరుపతి మధ్య బాణసంచా పోటీ

ఏలేరు నదికి అవతల, ఇవతల గ్రామాలైన పెద్దాపురం మండలం చదలాడ, తిరుపతి గ్రామాల మధ్య బాణసంచా పోటీ తారాస్థాయికి చేరింది. ఏటా ఆనవాయితీగా వచ్చే ఈ పోటీలను గ్రామ స్థాయిలో పోటీపోటీగా లక్షల రూపాయలు వెచ్చించి బాణసంచాను పేల్చారు.

మరిడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

దీపావళి పర్వదినం సందర్భంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో మరిడమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు లక్షీపూజలను ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దీపోత్సవం నిర్వహించారు.